క్లుప్తంగా

జైనుల ర్యాలీ



డోర్నకల్: డోర్నకల్ పట్టణంలో శనివారం జైన మతస్తులు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆదినాథ్ భగవాన్ ఆలయంలో ప్రతిష్ఠించనున్న ప్రాణ ప్రతిష్ట పొందిన పన్నెండు తీర్థంకరుల విగ్రహాలతో జైన మతస్తులు ర్యాలీ నిర్వహించారు. దిగంబర జైన్ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మహిళలు, పురుషులు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు.

పాలాభిషేకం



పెద్దవంగర: మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొరిపల్లి ఉప సర్పంచ్ వీరారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ శనివారం మండల కేంద్రంలోని సోనియా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సీతారాం నాయక్, రంగు మురళి గౌడ్, కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పదవి ఇవ్వాలి

దంతాలపల్లి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో గెలిచిన డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పొన్నోటి బాలాజీ అన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ దర్శనాల సుస్మిత రవీందర్, బొల్లు వీరన్న, ఎంపీటీసీ యాకన్న పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడెం శివారు ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం సాయంత్రం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

మొక్కు చెల్లింపు

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి సీఎం కావాలని మొక్కుకున్న అభిమాని కోరిక నెరవేరడంతో శనివారం బయ్యారంలోని శివాలయంలో తన మొక్కును చెల్లించుకున్నాడు. బయ్యారానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అభిమాని బంగారి వీరన్న రేవంత్‌రెడ్డి సీఎం అయితే దేవుని హుండీలో వెయ్యి రూపాయల కానుక వేస్తానని మొక్కుకున్నాడు. తన మొక్కు ప్రకారం హుండీలో డబ్బులు వేశాడు.

5క్వింటాళ్ల బియ్యం వితరణ

గార్ల: గార్లలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో శ్రీ ధర్మశాస్త్ర పీఠము 40 మంది అయ్యప్పస్వాములకు ప్రతీరోజు మధ్యాహ్నం భిక్ష కోసం గార్ల పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ 5 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా బియ్యం అందజేసినట్లు పేర్కొన్నారు.

ఫ్రూట్స్ డే వేడుకలు



డోర్నకల్: స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో శనివారం ఫ్రూట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫ్రూట్స్ డేను పురస్కరించుకుని పాఠశాలలో పలు రకాల పండ్లను ప్రదర్శించి వాటితో ఆరోగ్యానికి జరిగే ఉపయోగాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం పలు రకాల పండ్ల ఆకారాలతో చిన్నారులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు హలీమా, మౌనిక, భారతి, వసంత, రోజా పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలి

మహబూబాబాద్: పారిశుద్ధ్య సమస్య పరిష్కారం విషయంలో ప్రజలు కూడా సహకరించాలని అందుకు వాహనాలు ఇంటి వద్దకు రాగానే సిబ్బందికి తడి చెత్తపొడి చెత్త వేరుచేసి ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వవార్డుతోపాటు పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనుల విషయంలో శనివారం చైర్మన్ పర్యవేక్షించి పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మార్నెని వెంకన్న పాల్గొన్నారు.

ఉపకార వేతనం.. భవితకు ఊతం

- ఎన్‌ఎంఎంఎస్‌తో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు మేలు
- ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు అర్హులు
- ఎంపికైన వారికి నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12వేల స్కాలర్‌షిప్



విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పెద్దవంగర: చదువుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్తోమత లేక ఎంతో విద్యార్థులు తమ చదువులను అర్థాంతరంగా ఆపేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ తరుణంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. పరీక్షలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఎంతో మంది ఉపకారవేతనం పొందుతూ ఉన్నత చదువుకు బాటలు వేసుకుంటున్నారు. అర్హత పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12వేలు చొప్పున తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు నాలుగేళ్లపాటు ఉపకారవేతనం అందిస్తారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు నేడు జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రంతోపాటు తొర్రూరు డివిజన్ కేంద్రంలో 678 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై 12.30 వరకు ఉంటుంది. విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి. ఓఎంఆర్ పత్రంలో విద్యార్థులు హాల్‌టికెట్ నంబర్ ఇతర వివరాలు జాగ్రత్తగా నింపాలి. జవాబులు ఇందులోనే నింపి, సమయం పూర్తి అయ్యే వరకు కేంద్రంలోనే ఉండాలి. వచ్చే టప్పుడు జవాబు పత్రం ఇన్విజిలేటర్‌కు అందజేయాలి. పరీక్ష కేంద్రానికి సెల్‌ఫోన్, గడియారం తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లొద్దు.

మార్కులు ఇలా..

ఇందులో మొత్తం 180 మార్కులు ఉంటాయి. పరీక్షలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో మానసిక సామర్థ్య పరీక్షలో 90 ప్రశ్నలు 90 మార్కులు. ఇందులో రీజనింగ్ ఎబిలిటీస్, కోడింగ్-డికోడింగ్, సంఖ్యాశాస్త్రం, వెన్ చిత్రాలు, పదాల భిన్న పరీక్ష, నంబర్ అనాలజీ, అల్ఫాబెట్ అనాలజీ, మిర్రర్ ఇమేజెస్‌తోపాటు తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి. రెండో విభాగంలో ఏడు, 8వ తరగతిలోని సిలబస్‌ల నుంచి 90ప్రశ్నలు 90మార్కులు ఉంటాయి. గణితం నుంచి 20 మార్కులు, భౌతిక, జీవ, రసాయన శాస్త్రం నుంచి 35 మార్కులు ఉంటాయి. తెలుగు ఇంగ్లిష్ భాషలో బహుళైచ్ఛిక రూపంలో ఉంటాయి.

ఉన్నత విద్యకు బాసట



ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పేద విద్యార్థుల ఉన్నత విద్యకు దోహదపడుతుంది. ప్రతీ ఏడాది ఈ పరీక్షలకు విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచిస్తున్నాం. ఈఏడాది ఎక్కువ మంది విద్యార్థులు ప్రతిభ చూపి ఈ పథకంలో లబ్ధిపొందుతారని ఆశిస్తున్నాం.

- బుదారపు శ్రీనివాస్, హెచ్ఎం, పెద్దవంగర

6 గ్యారంటీలను అమలు చేస్తాం



మహబూబాబాద్ అర్బన్: ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్న నాయకులు



గార్ల: బస్సులో ప్రయాణిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఝాన్సీలక్ష్మి

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురం అంజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించారు. కార్యక్రమంలో పోతురాజు రాజు, గుగులోత్ వెంకట్, రామగోని రాజు గౌడ్, నీరుటి సురేష్, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కురవి: మండలంలోని రాజోలు గ్రామంలో శనివారం డోర్నకల్ నుంచి మహబూబాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు మహిళలు స్వాగతం పలికారు. రాజోలుకు చెందిన మహిళలు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు.

గార్ల: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాల్లో భాగంగా శనివారం గార్లలో జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి మహిళల ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రమంతటా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంషాద్‌బేగం, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని కల్పించడం హర్షణీయమని మున్సిపల్ కమిషనర్ సరస్వతి అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని శనివారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డీఎం పరిమళతో కలిసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర్, ఎస్టీఐ రజిత, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణ కార్యక్రమాన్ని శనివారం బోడమంచ్యా తండాలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బండారు పద్మ, మాజీ సర్పంచ్ అల్లం రమ, ప్రభురాణి, మంజుల తదితరులు ఉచితంగా బస్సు ఎక్కి జ్యోతిరావుయ పూలే సెంటర్ వరకు ప్రయాణం చేసి ప్రారంభించారు.

మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న వెంకన్ననాయక్

మహబూబాబాద్ రూరల్: మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్ననాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానుకోటలోని మార్వాడీ సత్రంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోతు నందులాల్ సమక్షంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారి కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 36లక్షల మంది గిరిజనులు ఉంటే అందులో 30లక్షలకు పైగా లంబాడీలు ఉన్నారన్నారు. లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని, ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న లంబాడీలందరూ కూడా ఏకపక్షంగా ఓట్లు వేయడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని తెలిపారు. ఈ సమావేశంలో సేవాలాల్ సేన జాతీయ కోర్ కమిటీ సభ్యులు ధరావత్ మోతిలాల్ నాయక్, వైఎస్సార్ టీపీ మానుకోట ఇన్‌చార్జ్ గుగులోత్ రాములునాయక్, సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ వినోద్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధులు మాలోత్ సురేష్ నాయక్, జరుపుల బాలునాయక్, మహిళా సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాకావత్ పద్మ బాయి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న పులి దేవేందర్

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలైన సీపీఎస్, 371 జీఓ రద్దుకు కృషి చేయాలని టీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియం ఒలింపియాడ్ హాల్ టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో శనివారం నిర్వహించిన సమావేశానికి పులి దేవేందర్ హాజరై మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను వివరించి సమస్యలు పరిష్కారం అయ్యేందుకు సంఘం కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు అన్ని కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో టీసీపీఎస్ఈఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల కృష్ణ కుమార్, ప్రధాన కార్యదర్శి హనుమాండ్ల భాస్కర్, నాయకులు తిరుపతి, చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్: అతివృష్టి, అనావృష్టి, చీడపీడనల వలన పంటలు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం అందించాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా సహాయకార్యదర్శి ఎస్.కే.బాబన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బాబన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం మొక్క జొన్నకు ఎకరానికి రూ.30 వేలు, పత్తికి ఎకరానికి రూ.30వేలు, మిర్చికి ఎకరానికి లక్ష రూపాయలు, వరి పంటలకు ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం అందించాలన్నారు. లింగంపల్లి లింగయ్య, బాలు, పుల్లయ్య, యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సైబర్ లింకులు క్లిక్ చేయొద్దు



మాట్లాడుతున్న టౌన్ సీఐ వై. సతీష్

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే తమ జీవితంలో ఎన్నో సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని మానుకోట టౌన్ సీఐ వై.సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పత్తిపాక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలు, సైబార్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. దేశంలో నేటి విద్యా విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత విద్యలో రాణించాలన్నారు. సైబర్ లింకులపై క్లిక్ చేసి మోసపోవద్దని, మొబైల్ ఫోన్‌లో గేమ్‌లు ఆడవద్దని, పాస్‌వర్డు, ఓటీపీలు ఎవరికి షేర్ చేయొద్దన్నారు. బాలికలను, మహిళలను ర్యాగింగ్, ఇబ్బందులు పెడితే కేసుల పాలవుతారన్నారు. విద్యార్థులు సమాజంలో గౌరవ పదంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కిషన్ నాయక్, ఎస్సై దీపికా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయడం హర్షణీయం



మాట్లాడుతున్న సోమన్న

చిన్నగూడూరు: తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయడం హర్షణీయమని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు చిత్తారి సోమన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులపై ఆంధ్ర వలసవాదులు అక్రమ కేసులు పెట్టి జైళ్లు, కోర్టుల చుట్టూ తిప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కేసీఆర్ మొదటి సంతకం ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఎత్తివేయక, ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. కాంగ్రెస్‌తోనే తెలంగాణకు అన్ని విధాల న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వల్లూరి కృష్ణారెడ్డి, గునిగంటి కమలాకర్, వడ్లకొండ ఆదాం పాల్గొన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

జిల్లా వ్యాప్తంగా శనివారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



డోర్నకల్: సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



బయ్యారంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



గూడూరు: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న స్వామి



కురవి: గుడిసెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కేసముద్రం: కేక్ కట్ చేస్తున్న నాయకులు



గార్లలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు..



నెల్లికుదురు: కేక్ కట్ చేస్తున్న నాయకులు

చర్చనీయాంశంగా వర్గపోరు

గూడూరు: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చినా గూడూరు మండల కాంగ్రెస్‌లో మాత్రం వర్గపోరు తప్పడంలేదు. ఎన్నికల ముందు వరకు కల్సికట్టుగా పనిచేసిన మండల కాంగ్రెస్ నాయకులు, ఎన్నికలు సమీపిస్తుండడంతో పోరిక బలరాంనాయక్, డాక్టర్ మురళీనాయక్ వర్గాలుగా మారారు. దీంతో మండల కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలింది. శనివారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి పాలాభిషేకం చేయగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఇలా రెండు వర్గాలుగా కాంగ్రెస్ పార్టీ సోనియాగాంధీ జన్మదినాన్ని నిర్వహించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరు ఏర్పాటు చేసిన వేడుకలో పాల్గొనాలో తెలియని పరిస్థితిలో పడ్డారు. సమయానికి మండల కేంద్రానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు ఎక్కడో ఒక చోట పాల్గొందామని వెళ్లడం, అక్కడ తమ వర్గం వారు కనిపించకపోవడంతో తిరిగి మరో చోటికి వెల్లడం చర్చనీయాంశంగా మారింది.

ముందుకు సాగని రోడ్డు పనులు



రహదారికి ఇరువైపులా కంకర పరిచి పనులు వదిలేసిన కాంట్రాక్టర్

దంతాలపల్లి: మండలంలోని తూర్పుతండా, పెద్ద ముప్పారం గ్రామాల మీదుగా సూర్యాపేట జిల్లా కుంటపల్లి గ్రామం వద్ద సూర్యాపేట ప్రధాన రహదారికి కలిసే రోడ్డు పనులు నెలలు గడుస్తున్న ముందుకు సాగడం లేదు. కొన్ని నెలల క్రితం ఈ రహదారి సుమారు 12కిలోమీటర్లు, రూ.14కోట్ల వ్యయంతో టెండర్ నిర్వహించారు. కొంత మంది కాంట్రాక్టర్‌లు ఈ రోడ్డు పనులు చేస్తామని కాంట్రాక్టు తీసుకున్నారు. రోడ్డు పనులు నిర్వహించి గతంలో ఉన్న పాత సింగిల్ రోడ్డుకు ఇరువైపుల కంకర పోసి, రోడ్డుపై ఉన్న మోరీలను తొలిగించి వాటి స్థానంలో కొత్త మోరీలు వేశారు. నెలలు గడుస్తున్న పనులు చేయకపోవడంతో రోడ్డుపై గుంతలు పడి, రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అనేకసార్లు మోటారు వాహనాలు పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు స్పందించి వెంటనే పనులు మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామశివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు, స్థానికులు, బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ గ్రామానికి చెందిన వల్లందాసు నిశాంత్ మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు మండలంలోని ముంగిమడుగులోగల బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నాడు. మండలంలోని పర్వతగిరి గ్రామ శివారులో రహదారిపై ధాన్యం రాశులుగా పోసిన విషయాన్ని అతడు గుర్తించలేదు. ద్విచక్ర వాహనం ధాన్యం రాశిపైకి దూసుకువెళ్లి అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నిశాంత్‌కు తలకు తీవ్ర గాయాలు కాగా గుర్తించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అతడికి చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కురవి: మండలంలోని సూదనపల్లి శివారు బీబీనాయక్ తండాలో శనివారం మహబూబాబాద్‌కు చెందిన సూర్యచంద్ర కంటి ఆస్పత్రికి చెందిన డాక్టర్ సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ బోడ శ్రీను సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. తండావాసులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిచూపు తక్కువ ఉన్న వారందరికి మానుకోటలోని సూర్యచంద్ర ఆస్పత్రిలో ఆపరేషన్ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎ.మాధవరావు, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్త బోడ పద్మ, ఏఎన్ఎం సమత, మాధవి, భూక్య రవి, బోడ రవీందర్, వీరన్న పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్ :
9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646